# ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

■ కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, డీఎస్పీ పార్థసారథి

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 10 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా అధికారులు ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి సూచించారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ కమిటీ సభ్యులు, అధికారులు, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసిన ప్రతి ఒక్కరిపైన చర్యలుంటాయని గ్రామాల్లో, పట్టణాల్లో ప్రతి ఒక్కరూ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా పార్టీ గుర్తులు, గోడలపై రాతలు, ఫ్లెక్సీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తనిఖీలు చేసే కేంద్రాల వద్ద అధికారులు, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీ కేంద్రాల వద్ద రెండు షిఫ్టుల్లో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసి పంపించాలన్నారు. ఎన్నికల కమిటీ అధికారులు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ అధికారుల విధులు, బాధ్యతలు, వారికి వాహనాల కేటాయింపు పలు అంశాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసులు తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కల్వకుర్తి ఆర్డీవో శ్రీను

## ఫ్లెక్సీలు, గోడలపై రాతల తొలగింపు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్10 : కల్వకుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఫ్లెక్సీలు, గోడలపై రాతలు, నేతల విగ్రహాలు, పార్టీ జెండాలు, పార్టీ గుర్తులను తొలగించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల గోడలపై గతంలో రాసిన ఆయా పార్టీలకు సంబంధించిన నాయకుల రాతలు, పార్టీ గుర్తులను, ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు. గ్రామాల్లో ఉన్న నాయకుల విగ్రహాలకు, పార్టీ జెండాదిమ్మల వద్ద ఉన్న పార్టీ గుర్తులకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ అధికారులకు సహకరించాలని ఎంపీడీవో ఆంజనేయులు కోరారు.



తాండ్రలో పార్టీ జెండాలపై ముసుగు వేయిస్తున్న సిబ్బంది



లింగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విప్ గువ్వల బాలరాజు

## బాధిత కుటుంబాలకు విప్ గువ్వల పరామర్శ

చారకొండ, అక్టోబర్ 10 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నేత చింతపల్లి గోపాల్ తల్లి సత్యమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా చారకొండ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి తండ్రి లింగారెడ్డి ఇటీవల మృతి చెందాడు. కుటుంబాన్ని పరామర్శించి, లింగారెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. విప్ గువ్వల వెంట సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు గజ్జెయాదయ్య, ఎంపీటీసీ లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సలీం, మాజీ వైస్ ఎంపీపీ జంగయ్య, నాయకులు కొండల్‌గౌడ్, రమేశ్, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఊర్కొండ, అక్టోబర్10 : మండలంలోని ముచ్చర్లపల్లికి చెందిన దార వెంకటయ్య కుమారుడు దార వివేక్ మండలకేంద్రంలోని వెంకట బలరామయ్య మెమోరియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి వెంకటయ్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించడమే భారం కావడంతో కొడుకును చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, నాగర్‌కర్నూల్ కరాటే, కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి పేద విద్యార్థి దార వివేక్‌కు చదువు కోసం రూ.10 వేలు పంపించగా బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆ విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకుడు కొమ్ము శ్రీను, మల్లేశ్, గోపి,సందీప్, లక్ష్మణ్‌కుమార్‌గౌడ్, నరేశ్, శివ, తిరుపతయ్య ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి, అక్టోబర్ 10 : కల్వకుర్తి పట్టణంలోని 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బస్‌బార్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టీఎస్ సీపీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా కల్వకుర్తి, ఆమనగల్లు, మిడ్జిల్, డిండి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట మాడ్గుల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందనిఏఈ పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పీడబ్ల్యూడీ ఓటర్లను గుర్తించాలి



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ రవికుమార్

వెల్దండ, అక్టోబర్ 10 : ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఎల్‌వోలు ఓటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వెల్దండ తాసీల్దార్ రవికుమార్ అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలో పర్సన్ విత్ డిజబుల్ ఓటర్లను వెంటనే గుర్తించి జాబితా తయారు చేయాలన్నారు. ఓటింగ్ రోజు వారికి ప్రత్యేక వాహనంతోపాటు అన్ని సదిపాయాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ శ్రీనివాస్ బీఎల్‌వోలు ఉన్నారు.

# బీఆర్ఎస్‌లో అందరికీ సముచిత స్థానం



గోళి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న వెల్దండ బీఆర్ఎస్ నాయకులు

వెల్దండ, అక్టోబర్ 10 : బీఆర్ఎస్ పార్టీని నమ్ముకున్న వారికి ఎప్పుడూ అన్యాయం జరగదని, అందరికీ సముచిత స్థానం లభిస్తుందని వెల్దండ బీఆర్ఎస్ నాయకులు, ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ వెంకటయ్య అన్నారు. మంగళవారం వెల్దండ మండలకేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమకమైన గోళి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్, కృపానందం, మల్లయ్య, నాగయ్య, జంగిలి ప్రసాద్, ప్రవీణ్, వెంకట్‌ముదిరాజ్, గజినీ శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

# ఆర్చి నిర్మాణానికిభూ మిపూజ

వంగూరు, అక్టోబర్ 10 : మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో శ్రీశైలం ప్రధాన రహదారి నుంచి తమ గ్రామానికి వచ్చే రోడ్డు వద్ద సర్పంచ్ శిరీష భర్త బీఆర్ఎస్ నేత వెంకటేశ్వర్ రావు తన సొంత నిధుల నుంచి రూ.3.50 లక్షలతో స్వాగత తోరణం(ఆర్చి)ఏర్పాటుకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారి నుంచి తమ గ్రామానికి వచ్చే రోడ్డుపై స్వాగత తోరణం నిర్మించాలనే ఆలోచన ఎప్పటి నుంచో ఉందని దాన్ని తను వ్యక్తిగతంగా నిర్మించేందుకు పనులు ప్రారంభించామన్నారు. అవసరమైతే దాతల సహకారం కోరుతానన్నారు. స్వాగత తోరణం ఏర్పాటుకు గ్రామ అంబేద్కర్ సంఘం,యాదవ సంఘం, రజక సంఘం నాయకులు కృషి కూడా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, దొడ్డి శ్రీను, బద్దుల కృష్ణయ్య, రేణయ్యతో పాటు గ్రామ యువకులు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాల బ్యాగులను రైతులకు అందిస్తున్న ఏవో తనూజ

## విత్తనాలు పంపిణీ

వంగూరు అక్టోబర్ 10 : వంగూరులో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వేరుశనగ కదిరి లేపాక్షి 1812 రకం మినీకిట్స్ (విత్తనాలు)రైతులకు ఏవో తనూజ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా మండలానికి కేవలం 350 బ్యాగులు మాత్రమే రాగ వాటిలో 9 క్లస్టర్లకు 36 బ్యాగుల చొప్పున అందజేశామన్నారు. వాటిని రైతులు సాగు చేసి పంట దిగుబడిని పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సంతోష్ రైతులు ఉన్నారు.

## నవోదయ 9, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

బిజినేపల్లి, అక్టోబర్ 10 : బిజినేపల్లి మండలం వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షలకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ విడుదల చేసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 8వ తరగతి, 11వ తరగతి కోసం దరఖాస్తు చేసుకొనుటకు ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ఆధార్ కార్డు ఓటీపీ ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకొను విద్యార్థినీ, విద్యార్థులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నివాస ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. 9, 11తరగతులకు దరఖాస్తు చేసుకొనుటకు గానూ 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2009 మే 1నుంచి 2011 జూలై 31మధ్య జన్మించిన వారై ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1నుంచి 2009 జూలై 31 మధ్యలో జన్మించిన వారై ఉండాలని, దరఖాస్తుకు చివరి గడువు ఈనెల 31వరకు ఉంటుందని పేర్కొన్నారు. రాత పరీక్ష 10,02, 2024న ఉంటుందని, దరఖాస్తులను http:// www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కోరారు.

## ముస్తాబవుతున్న అమ్మవారి విగ్రహాలు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్10 : దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తా సమీపంలో అమ్మవారి విగ్రహాలను విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు వ్యాపారులు. దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రుల పూజలు చేయడం ఆనవాయితీ. దీంతో పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు.



దసరా కోసం సిద్ధమవుతున్న అమ్మవారి విగ్రహం